క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు : జంగాలపల్లిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బోధించడానికి దరఖాస్తులు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ సుజాత కోరారు. స్థానిక కేజీబీవీలో పీజీసీఆర్టీ ఇంగ్లిష్, పీజీసీఆర్టీ సివిక్స్, పీజీ నర్సింగ్ సబ్జెక్టులు తాత్కాలిక పద్ధతిలో బోధించడానికి బీఈడీ పీజీ, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. స్థానిక మహిళలు అయి ఉండాలన్నారు. ఈ నెల 29 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఇంటర్ గ్రూపులు, తరగతులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. 6వ తరగతిలో 20, 7వ తరగతిలో 19, 8వ తరగతిలో 9, 9వ తరగతిలో 7, ఫస్టియర్ సీఈసీలో 31, ఫస్టియర్ ఎంపీహెచ్‌డబ్ల్యూలో 31 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

మొక్కలు నాటిన సీఆర్పీఎఫ్ పోలీసులు



వాజేడు : మండల పరిధిలోని పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో సోమవారం సీఆర్పీఎఫ్ పోలీసులు మొక్కలు నాటారు. బీ/39 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ చామె నారాయణ్ తుకారాం ఆధ్వర్యంలో ట్రీ ప్లాంటేషన్‌లో భాగంగా ఈ మొక్కలను నాటినట్లు వారు తెలిపారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

వాజేడు : స్థానిక విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు లైబ్రరీ పుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని 38 పాఠశాలలకు వీటిని అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ లైబ్రరీ పుస్తకాలను ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీకి మోడల్ స్కూల్ ఎంపిక

ములుగు రూరల్ : జిల్లాలోని 11 మోడల్ పాఠశాలల్లో ములుగు మున్సిపాలిటీ పరిధిలోని బండారుపల్లి మోడల్ స్కూల్ పీఎంశ్రీ పథకంలో చేపట్టిన కార్యక్రమాల్లో మొదటి స్థానంలో నిలిచిందని పాఠశాల ప్రిన్సిపాల్ దేవకి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు గాను జిల్లాలో 11 పాఠశాలల్లో బండారుపల్లి మోడల్ స్కూల్ మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యాలు మెరుగుపడనున్నాయని తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



సూరమ్మ(ఫైల్)

ములుగు రూరల్ : మండలంలోని పొట్లాపూర్ గ్రామానికి చెందిన ఏలూరి సూరమ్మ (50) అనారోగ్యంతో మృతి చెందింది. పొట్లాపూర్ గ్రామ సర్పంచ్‌గా సూరమ్మ సేవలు అందించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

టీఎస్‌టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా రమేశ్



ఎస్‌ఎస్‌తాడ్వాయి : తెలంగాణ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం(టీఎస్‌టీడబ్ల్యూటీయూ) రాష్ట్ర అదనపు కార్యదర్శిగా మేడారం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కొక్కెర రమేశ్ ఎన్నికయ్యారు. మేడారం సమ్మక్క పూజారి రమేశ్ గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుడిగా కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర ఉపాధ్యాయుల సమావేశంలో రమేశ్‌ను అదనపు కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర టీఎస్ టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాములునాయక్, ఉపాధ్యాయులకు రమేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ శాఖ మండల అధికారి కల్యాణి ఎస్సై సుధాకర్‌తో కలిసి సోమవారం తనిఖీలు చేపట్టారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్‌లు, బిల్లు బుక్కులు, ధరల పట్టికను పరిశీలించారు. అలాగే షాపుల్లో నిల్వ చేసిన ఎరువుల వివరాలను తెలుసుకున్నారు. వారి వెంట ఏఈఓలు ఉన్నారు.

మేజర్ జీపీలో ఏం జరుగుతోంది ?

- అధికారుల మార్పుపై అయోమయం
- కమలాపురంలో 5 నెలల్లో ముగ్గురు కార్యదర్శుల బదిలీపై స్థానికుల్లో చర్చ

మంగపేట : మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన కమలాపురం పంచాయతీ కార్యదర్శులు నెల లేదా రెండు నెలలకు ఒకసారి మారుతుండడంతో అసలు పంచాయతీలో ఏమి జరుగుతోందని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2025 జనవరిలో అప్పటి కార్యదర్శి అరుణ్‌ను వాజేడు మండలం పేరూరుకు బదిలీ చేసి, ఫిబ్రవరి 1న మల్లూరు కార్యదర్శిని కిశోర్‌ను కమలాపురం కార్యదర్శిగా నియమించారు. ఆయనకే ఇన్‌చార్జ్ ఎంపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మూడు నెలల పాటు పనిచేసిన కిశోర్‌ను మే 28న పేరూరుకు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న అరుణ్‌ను వేరే మండలానికి బదిలీ చేశారు. జూన్ 01న కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం కార్యదర్శి సాదుల ప్రభాకర్‌ను కమలాపురం కార్యదర్శి, ఎంపీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. కనీసం రెండు నెలలు పూర్తి కాకుండానే ఆయన స్థానంలో ఈనెల 18న గోవిందరావుపేట మండలం పస్రా కార్యదర్శి శరత్‌బాబును, ఇన్‌చార్జ్ ఎంపీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా కమలాపురంలో విధులు నిర్వహించడం ఇష్టం లేకపోవడంతో నేటి వరకు విధుల్లో చేరలేదని సమాచారం. ఇదిలా ఉండగా మార్చిలో కమలాపురం పంచాయతీ బిల్‌కలెక్టర్‌గా విధుల్లో చేరిన సుధాకర్‌ను సైతం ఈనెల 18న ఏటూరునాగారం పంచాయతీకి డిప్యుటేషన్‌పై బదిలీ చేయడంతో పాటు పంచాయతీ స్పెషలాఫీసర్ సురేష్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని స్పెషలాఫీసర్‌గా బదిలీ చేశారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో పంచాయతీలో అసలు ఏమి జరుగుతుంది, ఎందుకిలా అధికారుల వెంట వెంటనే మారుతున్నారనే విషయంపై గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.



కమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయం

బదిలీల వెనుక ఆంతర్యం ఏంటో ?

జిల్లాలోనే అత్యధికంగా 25 గ్రామపంచాయతీలు కలిగిన మంగపేట మండలంలోని కమలాపురం మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శులను తరచూ మార్చడం, వారికి ఎంపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2023 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ఎంపీఓగా పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించడంపై వారిని నెలల వ్యవధిలో బదిలీ చేయడంపై పలు రకాల అనుమానాలకు తావిస్తోంది. ఓ జిల్లా అధికారికి అత్యంత సన్నిహితంగా వ్యవహరించి నమ్మకంగా ఉంటూ మండలంలో పనిచేస్తున్న ఉద్యోగి కనుసన్నల్లో ఈ వ్యవహారం జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఇన్‌చార్జ్ ఎంపీఓగా, కమలాపురం పంచాయతీ కార్యదర్శి, స్పెషలాఫీసర్‌గా పనిచేసిన కొందరు కోటి రూపాయలకు పైగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలపై సస్పెండ్ అయిన చరిత్ర ఉంది. అదేవిధంగా గడిచిన 5 నెలల కాలంలో భారీ ఎత్తున పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగిన విషయం బయటకు రాకుండా అధికారుల బదిలీలతో కప్పిపుచ్చుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. తరుచూ జరుగుతున్న పంచాయతీ కార్యదర్శుల మార్పు, ఎంపీఓగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వంటి తతంగానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు 2023 ఆగస్టులో వెంకటాపూర్(ఎం) మండలానికి డిప్యుటేషన్‌పై బదిలీపై వెళ్లిన రెగ్యులర్ ఎంపీఓ శ్రీనివాస్ శుక్రవారం తిరిగి మంగపేటకు బదిలీ చేసినట్లు తెలిసింది.

నిధుల దుర్వినియోగం జరగలేదు



గ్రామపంచాయతీలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరగలేదని, జరిగిందనే ఆరోపణలు అవాస్తవమన్నారు. సక్రమంగా విధులు నిర్వహించకపోవడం వల్లనే బదిలీలు జరిగాయన్నారు.
– ఒంటేరు దేవరాజ్, జిల్లా పంచాయతీ అధికారి

ఎస్‌ఎంహెచ్ హాస్టల్ మంజూరు చేయాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలో ఎస్‌ఎంహెచ్ హాస్టల్‌ను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్ సంపత్‌రావుకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఎస్సీ విద్యార్థులు ఉన్నత విద్యకోసం జిల్లా కేంద్రానికి వచ్చి హాస్టల్ సౌకర్యం లేక పోవడంతో వెనుదిరిగి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగారం డివిజన్ కేంద్రంలో హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు ఎస్సీల కోసం ఎస్‌ఎంహెచ్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జన్ను దేవేందర్, జగదీష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డిజిటల్ తరగతులు ప్రారంభం



ట్యాబ్‌లో డిజిటల్ క్లాస్‌లను చూపిస్తున్న విద్యార్థులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని కాటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులను హెచ్‌ఎం బాణాల సుధాకర్ సోమవారం ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఐ పులి రవి అందించిన ట్యాబ్‌లలో విద్యార్థులకు డిజిటల్ తరగతులను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ల్యాబ్ గదిలో ట్యాబ్‌ల సాఫ్ట్‌వేర్ ఆధారంగా డిజిటల్ క్లాస్ నిర్వహించామన్నారు. తరగతులకు సంబంధించి పరిజ్ఞానాన్ని విద్యార్థులు నేర్చుకుంటూ అందులో సైన్స్ క్విజ్ సబ్జెక్టు వారీగా నిర్వహించుకుంటూ విద్యార్థులు అభ్యసించినట్లు తెలిపారు. విద్యార్థులు డిజిటల్ క్లాసుల్లో చదువుతో పాటుగా అందులో ఉన్న వీడియో చూస్తూ క్లాసులు స్వయంగా వినడంతో చాలా అనుభూతి కలిగిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ట్యాబ్‌లు వితరణ చేసిన ఎన్నారై పులి రవి, హెచ్‌ఎం సుధాకర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సక్రు నాయక్, అక్బర్ బాషా, జీవన్ లాల్, సమ్మయ్య, సామ్సన్, పాపారావు, విజయ, శ్రీదేవి, రాజేష్, జయపాల్, వెంకటేష్, మోహన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే నాణ్యమైన దిగుబడి

- ఏడీఏ అవినాశ్‌వర్మ

ఏటూరునాగారం : ప్రకృతి వ్యవసాయంతోనే నాణ్యమైన పంటల దిగుబడి వస్తుందని ఏడీఏ అవినాశ్‌వర్మ అన్నారు. సోమవారం స్థానిక రైతు వేదిక కార్యాలయంలో వెలుగు రేఖ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు తనకున్న భూమిలో కొద్దిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సీఈఓ రజిత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించి లాభాలు పొందవచ్చని తెలిపారు. క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించి పంటలు పండిస్తే ముందు తరాల వారికి ఆరోగ్యవంతమైన జీవితం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ వేణుగోపాల్, ఏఈఓలు రవికుమార్, రాజు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ అవినాశ్‌వర్మ

నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి



ఏపీఓ వసంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న రఘు, లబ్ధిదారులు

ఏటూరునాగారం : మండలంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏపీఓ వసంతరావుకు లబ్ధిదారులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కొంతకాలంగా ఇంటి స్థలాలు లేక గూడు లేని నిరుపేదలకు, గోదావరి పరివాహక ముంపు ప్రాంతాల ప్రజలకు కనీసం 150 మంది బాధితులకు కోడిపుంజుల అంగడి స్థలం వద్ద ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు కర్ల అరుణ, చేల వినయ్, చిన్నన్న, శ్రీనివాస్, రవీందర్, మంగ, రాందాస్, నర్సమ్మ, బుచ్చమ్మ తదితరులు ఉన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి



మంగపేట: వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున



వెంకటాపురం (ఎం) : విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

మంగపేట : ప్రజలు వర్షాకాలం ముగిసే వరకు ఆరోగ్య జాగ్రత్తలు తప్పక పాటించాలని చుంచుపల్లి వైద్యాధికారిణి యమున అన్నారు. మండలంలోని కొత్తమల్లూరులో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 11 మంది జ్వర పీడితులకు మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా జనావాసాల పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని, మురుగు నీరు, వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం సీతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): మండలంలోని మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలతో పాటు చెంచుకాలనీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థినిలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాల, కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ భవ్య, కళాశాల రీజనల్ కోఆర్డినేటర్ సతీష్, ప్రిన్సిపాల్ వందన, సీహెచ్‌ఓ పూర్ణ సంపత్‌రావు, సూపర్‌వైజర్ పుష్పకుమారి, ఏఎన్‌ఎంలు అనురాధ, స్వప్న పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్‌కు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బుచ్చయ్య, బీఆర్‌ఎస్ నాయకులు

వాజేడు : నార్త్ అమెరికాలో జరిగే పవర్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన మోడెం వంశీ వెళ్లడానికి బీఆర్‌ఎస్ నాయకులు బోదెబోయిన బుచ్చయ్య ఆర్థికసాయం అందించారు. పేద కుటుంబంలో జన్మించిన వంశీ నార్త్ అమెరికా వెళ్లడానికి రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఆర్థికసాయం అందించాలని కోరారు. స్పందించిన బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు రూ.25 వేలు, వాజేడు మండల బీఆర్‌ఎస్ నాయకులు, నూగూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుచ్చయ్య రూ.50వేలు మొత్తం రూ.75 వేలు వంశీకి అందించారు. ఆర్థికసాయం అందించిన వారిలో మండల అధ్యక్షుడు రామ కృష్ణారెడ్డి, తిరుపతి, సాంబశివరావు, ప్రకాష్, నాగరాజు, మనో వికాష్, వేణు, రామకృష్ణ, కిరణ్ తదితరులు ఉన్నారు.

శేషమ్మ కుటుంబానికి..

అనారోగ్యంతో మృతి చెందిన ఎక్కెబోయిన శేషమ్మ కుటుంబానికి సోమవారం దహన సంస్కారాల నిమిత్తం కాంగ్రెస్ నాయకులు ఆర్థికసాయం అందించారు. మండలంలోని ఏడ్జెర్లపల్లి గ్రామానికి చెందిన శేషమ్మ హనుమకొండలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పేద కుటుంబం కావడంతో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆమె కూతురు స్వప్నకు రూ.7 వేలు అందించారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో అంకెనబోయిన నర్సింహరావు, చెన్నం మోహన్ రావు, సుమన్, బట్టు బాబు, నర్సింహారావు ఉన్నారు.

విద్యార్థులకు మంచి ఆహారం అందించాలి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ సర్దార్ సింగ్

వాజేడు : గురుకులాలు, హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి ఆహారం అందించాలని మండల ప్రత్యేకాధికారి సర్దార్‌సింగ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం హాస్టల్ వార్డెన్లు, ప్రత్యేకాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, పెద్ద గొళ్లగూడెం బాలికల ఆశ్రమ హాస్టల్ వార్డెన్ కేశవరావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుజాత, మినీ గురుకులం వార్డెన్ సుజాత, బద్రీ, రమేష్ పాల్గొన్నారు.

సీఐని కలిసిన ఆదివాసీ సంఘాల నాయకులు



వెంకటాపురం(కె): సీఐని సన్మానిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు



గోవిందరావుపేట : సీఐ దయాకర్‌ను శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెంకటాపురం(కె): నూతన సీఐగా విధుల్లో చేరిన సీఐ ముత్యం రమేశ్‌ను ఆదివాసీ సంఘాల నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీ హక్కులను, చట్టాలను పరిరక్షించాలని కోరారు. సీఐని కలిసిన వారిలో ఆదివాసీ సంఘాల నాయకులు పర్శిక సతీష్, రామచందర్, సోమరాజు, గణేష్, గిరిబాబు, వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

పస్రా సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

గోవిందరావుపేట : పస్రా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న పత్తిపల్లి దయాకర్‌ను మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, మండల నాయకులు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మండల పరిస్థితులపై మాట్లాడారు. ప్రజలు గ్రామాల్లో శాంతియుతంగా ఉండేందుకు నాయకులు కృషి చేయాలని సీఐ సూచించారు. సీఐని కలిసిన వారిలో కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, జనార్ధన్‌రెడ్డి, సుధాకర్, ఉమాదేవి, నాగమణి, వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి, వసంత, కిరణ్, రతన్, సంధ్య, శాంత తదితర నాయకులు పాల్గొన్నారు.

నాగారం, జంగాలపల్లిలో మద్యంషాపు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

వాజేడు : వాజేడు నాగారం పేరుతో వచ్చిన మద్యం షాపునకు సంబంధించిన పెసా గ్రామసభను నాగారం, జంగాలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడులకు ప్రజలు వినతిపత్రం ఇచ్చారు. వాజేడు నాగారం గ్రామ పంచాయతీకి మద్యం షాపు మంజూరు కాగా 15 ఏళ్లుగా ఒక్క వాజేడు వారే దాని మీద వచ్చే ఆదాయాన్ని తీసుకుంటున్నారని ఆరోపించారు. మండల కేంద్రంలో వాజేడు, నాగారం, జంగాలపల్లి కలిసి ఉన్నప్పటికీ దాని మీద వచ్చే ఆదాయాన్ని కేవలం వాజేడు వారు మాత్రమే తీసుకోవడం దారుణ మన్నారు. మద్యం దుకాణానికి సంబంధించిన పెసా గ్రామ సభను నాగారం లేదా జంగాలపల్లిలో నిర్వహించి మద్యంషాపుపై రెండు గ్రామాల్లో ఏదో ఒక చోట ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల గిరిజనులు వినతి పత్రం ఇచ్చారు.

వాజేడులో ఏర్పాటుకు అనుకూలం

మండల కేంద్రంలోని మద్యం దుకాణానికి సోమవారం నిర్వహించిన పెసా గ్రామ సభకు గ్రామస్తులు అనుకూలం అని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, పెసా సభ్యులు నాగరం గ్రామ పంచాయతీ సెక్రటరీ ప్రభాకర్ ఈ గ్రామ సభను నిర్వహించారు. సభకు భారీ సంఖ్యలో గ్రామస్తులు హాజరయ్యారు. 75 మంది కోరం అవసరమై ఉండగా 139 మంది చేతులు పైకెత్తి గ్రామ సభకు అనుకూలంగా సమ్మతి తెలిపారు. దీంతో మద్యం షాపు గ్రామసభ విజయవంతం అయినట్లు వారు ప్రకటించారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె) : అసాంఘిక శక్తులపై ప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుపతిరావు అన్నారు. నేటి నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి మండలంలోని ఎదిర గ్రామ శివారుల్లో పోలీసులు సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. మండల కేంద్రానికి వచ్చి వెళ్లే వాహనా లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా తారస పడితే వారి నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

వాజేడు : మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామం వద్ద ఎస్సై జక్కుల సతీశ్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు అందులో తరలిస్తున్న వస్తువులపై ప్రత్యేక నిఘాను ఉంచారు. ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టుల వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలను చోటు చేసుకోకుండా చూస్తున్నారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండల కేంద్రంలో మేడారం వెళ్లే దారిలో కామారం రోడ్డు వద్ద తాడ్వాయి పోలీసులు సోమవారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సిబ్బందితో కలిసి తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మేడారం నుంచి తాడ్వాయి మీదుగా, తాడ్వాయి నుంచి మేడారానికి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.



వెంకటాపురం(కె) : ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం మానుకోవాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు


మంగపేట : జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీపై చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు హెచ్చరించారు. మండలంలోని కొత్తమల్లూరు, రాజుపేట తదితర గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల గాయపడిన కొత్తమల్లూరుకు చెందిన బాలిక వర్షితను, కిడ్నీ ఆపరేషన్ చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి పొందుతున్న కార్యకర్త నిర్మలను పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. లక్ష్మణ్‌బాబును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు రోజు రోజుకు పెరుగుతున్న ప్రజా ఆదరణను చూసి జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో ప్రత్యర్థి పార్టీల నాయకులు, యూట్యూబ్ చానళ్ల వాళ్ళు పని కట్టుకుని బీఆర్‌ఎస్‌లో విభేదాలు ఉన్నాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్లు రమేష్, అశోక్‌గౌడ్, జిల్లా సీనియర్ నాయకుడు కృష్ణ, ధనలక్ష్మి, నర్సింహారావు, సమ్మయ్య, రాజేందర్, రమేష్, రాజయాదవ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణ్‌బాబు

సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలి


ములుగు రూరల్ : టెక్నాలజీ యుగంలో ప్రతీ ఒక్కరు సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం అన్నారు. సోమవారం కళాశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మిడియాలో వచ్చే యాప్‌లు, గూగుల్ లింక్‌లు, క్యూఆర్ కోడ్‌లను ఓపెన్ చేయకూడదని అన్నారు. విద్యార్థులు గ్రామాల్లోని ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ శిరీష,ఎస్‌బీఐ రిసోర్స్‌పర్సన్ రమేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లేశం

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లు, నేర అనుమానిత వ్యక్తులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సీఐ సురేశ్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు, సస్పెక్ట్ వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నేరచరిత కలిగిన వ్యక్తులు సమాజంలో తలదించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. అవగాహన లేక కేసుల్లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్న వారు సత్ప్రవర్తన కలిగి ఉండి గొడవలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సురేశ్